




బాగుండాలని కోరుకుంటారు భక్తులు. ఇంపు సొంపుల చీరలు తీసుకొస్తారు. ముచ్చటైన రంగులు ఎన్నుతారు. అంచులు ఆడంబరంగా కనిపించాలని భావిస్తారు. దానిపైన పెట్టే నగలూ, దండలూ వేటికవే సరిసాటిగా ఉండేలా చూసుకుంటారు. అయ్యగారు ఏం అడిగినా చిటికెలో సమకూర్చి పెడతారు. ఈ ఆరాటమంతా జగద్ధాత్రికి ప్రత్యేకమైన నవరాత్రి సమయంలో ఆమె అలంకారం అద్భుతంగా ఉండాలన్నదాని కోసమే. అలాంటి చూడచక్కటి అలంకారాన్ని అచ్చంగా పువ్వులతోనూ చేస్తున్నారు కొందరు అర్చకస్వాములు. పూలదొంతరల మధ్య గౌరమ్మ ఒదిగినట్టే... ఈ ముస్తాబుల్లో అమ్మ వారి విగ్రహం విరుల వరుసల్లో ఒదిగిపోతుంది.

బతుకమ్మ పేర్చడానికి తంగేడు మొదలు కలువల దాకా... టేకు పూల నుంచి గుమ్మడి పూల దాకా... ఎలా విభిన్న రకాలను వాడతారో...ఇక్కడా అలంకారాల కోసం రకరకాల పువ్వులను ఉపయోగిస్తున్నారు. ఎన్నెన్ని వర్ణాల పువ్వులు... ఏ దేవుడిచ్చెనే రంగులు... అన్నట్టు, ఒక్కో పువ్వుదీ ఒక్కో వర్ణం. దేని అందం దానిది. దేని ఆకర్షణ దానిది. కనకాంగద కేయూరను కనకాంబరాలతో అలంకరిస్తున్నారు ఒకచోట. నిత్యానందకరిని ముత్యమంటి మల్లెలతో ముంచెత్తుతున్నారు మరొకచోట. పద్మాసనికి పద్మాల రేకులు ఓ చోట అలంకారమయ్యాయి. గుడాన్న ప్రీతకు గులాబీలు ఇంకో చోట కోకలయ్యాయి. సరిగంచు చీరకు సరిసాటి అన్నట్టు.. పూల మాలలే నూలు పోగులుగా ఇందులో చీరలు నేస్తున్నారు. నీల మణులను పోలిన నీలి రంగు పువ్వులు అక్కడక్కడా మిరుమిట్లు గొలుపుతున్నాయి. చేమంతులూ, సంపెగలకూ సరిపడా చోటిస్తున్నారు. గన్నేరునూ చిన్నబుచ్చడంలేదు. అలంకారాల విషయంలో ఏ చేతి నైపుణ్యం ఆ చేతిది. ఏ అమ్మ అందం ఆ అమ్మది. పండుగ వేళ మెత్తటి పూల మధ్య ఒదిగిన ఆ అమ్మ, చల్లటి మనసుతో దీవిస్తే అదే మనకు పదివేలు... ఆ ఆనందమే చాలు!! ■






